క్లుప్తంగా

అంబటిని కలిసిన గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధార్థనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ పదవి అనేది ప్రతి ఒక్కరిపై ఎంతో బాధ్యతను పెంచుతోందన్నారు. సుధీర్ భార్గవ్‌రెడ్డి భవిష్యత్తులో ఒక మంచి నేతగా ఎదగాలని ఆకాంక్షించారు.

విజయమే పరమావధిగా కృషి చేయాలి



చిలకలూరిపేట: పార్టీని విజయ తీరాలకు చేర్చట మే లక్ష్యంగా పనిచేయాలని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి శుక్రవారం చిలకలూరిపేటలోని మాజీ మంత్రి విడదల రజిని నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను విడదల రజిని సన్మానించి అభినందనలు తెలిపారు. మాజీ మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష మేరకు పనిచేయాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పెదకూరపాడు: మండలంలోని 75 తాళ్లూరులో మాగులూరి ఫౌండేషన్ సౌజన్యంతో కాటూరు మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో జేబీ పాఠశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మంది రోగులకు గుండె, షుగర్, ఊపిరితిత్తులు, థైరాయిడ్, కంటి, దంత వైద్య నిపుణులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిర్వాహకులు ఎన్నారై భాను ప్రకాష్ మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్యం అందుబాటులో తీసుకొచ్చేందుకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

యువత ఆర్థిక బలోపేతానికి సబ్ ప్లాన్ నిధులు

సత్తెనపల్లి: ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా నిధులు మంజూరు చేసి యువతను ఆర్థికంగా బలోపేతం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా సెక్రటరీ నందిగామ చిట్టిబాబు శుక్రవారం డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా అమలు చేసి యువతకు సహకారం అందించాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికలకు ముందుగా ప్రకటించిన విధంగా అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వం అర్హులైన నిరు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ సత్తెనపల్లి కార్యదర్శి పి.యిర్మియా డిమాండ్ చేశారు. పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో అర్జీలు స్వీకరించారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆర్.శేషయ్య, ఎం.నరసింహారావు, జంపని నరసింహారావు, పూర్ణయ్య, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో బాలుడికి తీవ్ర గాయాలు

అచ్చంపేట: విద్యుత్ షాక్‌తో బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన స్థానిక వీరభద్రస్వామి కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. కాలనీకి చెందిన బాలుడు సాత్విక్ ఎగరేస్తున్న గాలిపటం వీధిలోని విద్యుత్ తీగలకు చుట్టుకుంది. దాన్ని తీసేందుకు డాబాఎక్కి ప్రయత్నిస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఒళ్లంతా కమిలిపోయి పడిపోయాడు. గమనించిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చి, వెంటనే పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం బాలుడిని ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు.

అనారోగ్యంతో ఏఎన్‌ఎం మృతి

రాజుపాలెం: గణపవరం సబ్ సెంటర్‌లో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న జి.కోటిలింగమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మరణించింది. 17 ఏళ్ల నుంచి ఏఎన్‌ఎమ్‌గా చేస్తునారు. ఆమె మృతికి వైద్యులు వెంకటకృష్ణకుమార్, రవితేజనాయక్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఆరోగ్య సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆఖరి మజిలీకి కష్టాలు

- వడ్డవల్లి రఘురాం నగర్ హిందూ శ్మశాన వాటిక దీన పరిస్థితి
- అంత్యక్రియలకు కనీస సౌకర్యాలు మృగ్యం
- పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్న శ్మశాన వాటిక



వడ్డవల్లి రఘురాం నగర్‌లోని శ్మశాన వాటికలో అడవిలా పెరిగిన పిచ్చి చెట్లు

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి రఘురాంనగర్ హిందూ శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాల నిర్వహణకు ఆటంకాలు తప్పడం లేదు. శ్మశాన వాటికలో దుర్భర పరిస్థితి నెలకొంది. ఈ శ్మశాన వాటిక ఒకప్పుడు 2.50 ఎకరాలుగా ఉండేది. అది రానురాను ఆక్రమణలతో ప్రస్తుతం సుమారు 1.50 ఎకరాలకు కుచించుకుపోయింది. పట్టణంలో దాదాపు 70 వేల జనాభా ఉండగా వడ్డవల్లి ప్రాంతంలోని హిందువులందరికీ ఇదే శ్మశాన వాటిక. శతాబ్దాల క్రితం పట్టణం ఏర్పడినప్పుడు కేటాయించిన స్థలంలోనే మృతదేహాల ఖననం, దహనం చేస్తున్నారు. స్థలం కొరత తీవ్రంగా ఉంది. దీంతో ముందుగా శ్మశాన వాటికకు మృతుడి బంధువులు వెళ్లి, దహన సంస్కారాలకు అనువైన స్థలం వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్తగా స్థలం లభించే పరిస్థితి లేక పోవడంతో మృతదేహాలను ఖననం చేసిన చోటే మళ్లీ గుంతలు తీసి పూడుస్తున్నారు. చాలా ఏళ్లగా హిందువులను ఈ సమస్య పట్టిపీడిస్తోంది.

స్థలం కొరత

ఏటా దసరా పండగ ముందు జరిగే పెద్దల పండగకు తమ వారి సమాధుల వద్దకు వచ్చి హిందువులు చాలా అసహనానికి గురవుతున్నారు. చాలాసార్లు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులకు సమస్యపై విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని వడ్డవల్లి వాసులు వాపోతున్నారు. పట్టణ పరిధిలో ఉన్న స్థలాలు విలువైనవి కావడంతో అధికారులు ఈ సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. కనీసం శ్మశాన వాటికలో అడవిని తలపించేలా పెరిగిన పిచ్చి చెట్లను తొలగించడం, పిండ ప్రదానాలకు కావాల్సిన కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. శ్మశాన వాటికలో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.



అంత్యక్రియలకు అవస్థలు



సరిగా పని చేయని చేతి పంపు

దుర్వాసన..

శ్మశాన వాటికలో వర్షం కురిస్తే దుర్వాసన వెదజల్లుతోంది. కనీసం చేతిపంపు సరిగా పని చేయడం లేదు. వచ్చిన కొద్ది పాటి నీటితోనే పరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించడం చాలా కష్టంగా ఉందని వడ్డవల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో వైభవంగా వైకుంఠ ఏకాదశి



రాజుపాలెంలో వేంకటేశ్వరస్వామి



వడ్డవల్లిలో బంగారు నామం అలంకరణ



సర్వాంతర్యామి అలంకరణలో..



బెల్లంకొండ: ప్రత్యేక అలంకరణలో శ్రీవారు



ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారు బంగారు నామం అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి సర్వంతర్యామిగా అలంకరణ చేశారు. రెండు ఆలయాలకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరై పూజలు చేశారు. నందిగామలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, సీతారామాంజనేయ దేవాలయాల్లో 24 గంటల ఏకనామ సంకీర్తన నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వరి, శ్రీ సీతారామాంజనేయ, శ్రీ రాజ్యలక్ష్మి, మేడికొండూరు శ్రీ ప్రసన్నాంజనేయ భజన బృందాలు సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి వైకుంఠ ఏకాదశి

అచ్చంపేట: ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానిక సీతారామస్వామివారి దేవాలయం వద్ద వాసవీ కన్యకాపరమేశ్వరి వర్తక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. గరుడవాహనారూఢుడైన సీతాసమేత శ్రీరామచంద్రుడిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు భక్తులు వేకువ జామునే దేవాలయానికి క్యూ కట్టారు. వర్తక సంఘం, లక్ష్మీ తిరుపతాంబ భజన సమాజం భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్యవైశ్య మహిళా విభాగం తిరుప్పావై విష్ణు సహస్రనామార్చనలు చేసింది. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రత్యేకంగా నిర్మించిన కొఠారులోకి వేంచేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. సీఐ వెంకటప్రసాద్ బందోబస్తు ఏర్పాటు చేశారు. హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు కూడళ్లలోని అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం సహకారంతో ఆటల పోటీలు నిర్వహించారు. వేంకటేశ్వర నాట్యమండల హరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శించారు.

దేవాలయాలకు పోటెత్తిన భక్తులు

రాజుపాలెం: మండలకేంద్రంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం భక్తులు శుక్రవారం పోటెత్తారు. భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. బ్రాహ్మణపల్లి శివాలయం, రాజుపాలెం కోదండరామస్వామి ఆలయంలో భక్తులు ఏకనామం నిర్వహించారు.



గ్రామోత్సవంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా పూజలు

నకరికల్లు: దేచవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గరుడ వాహనంపై కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి గ్రామోత్సవం ప్రారంభించారు. మహిళా భక్తులు వార్లు పోసి మొక్కులు చెల్లించారు. హరినామ సంకీర్తనలు ఆలపిస్తూ ఉత్సవంలో పాల్గొన్నారు.



చాగంటివారిపాలెంలోని జగన్నాథస్వామి



లక్ష్మీ నర్శింహస్వామి గ్రామోత్సవం

ప్రత్యేక పూజలు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని పలు ఆలయాల్లో స్వామి వార్లకు వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్తర ద్వారంలో స్వామివార్లను భక్తులు దర్శించుకున్నారు. చాగంటివారిపాలెం గ్రామంలోని బలభద్ర సమేత జగన్నాథస్వామి, కుందురువారిపాలెంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవద్గీత పారాయణ, హరినామ సంకీర్తన ఏకాహం నిర్వహించారు.

వైభవంగా..

బెల్లంకొండ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండల కేంద్రమైన బెల్లంకొండ గ్రామంలో కొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మకర్త గోపాల్ నాయక్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ధూళిపాళ్లలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

సత్తెనపల్లి: ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన ఘటన ధూళిపాళ్లలో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాల మేరకు.. గేదేల రాకపోకలకు అడ్డంకిగా ఉన్న ఫెన్సింగ్ మధ్య తలెత్తిన వివాదం చివరకు ఘర్షణకు దారి తీసింది. మద్యం మత్తులో ఒకరిపై మరొకరు రాళ్లు, మారణాయుధాలతో దాడులకు దిగారు. ఆరుగురి తలలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులు మదన కృష్ణ, భీమాల రమేష్, వి.ఏడుకొండలు, అంజి, కోటయ్య, వెంకటేశ్వర్లును చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్ అమినుద్దీన్ వివరాలు సేకరిస్తున్నారు.



క్షతగాత్రుడికి వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

చిన్నారులను బెదిరించి సైకిల్ దొంగతనం

అచ్చంపేట: మండలంలోని పుట్లగూడెంలో చిన్నారులు సైకిల్ నేర్చుకుంటుండగా గుర్తుతెలియని ఇద్దరు వారిని కత్తులతో బెదిరించి సైకిల్ అపహరించారు. అనంతరం పోలీసులకు లొంగిపోయారు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. గ్రామస్తుల వివరాల మేరకు.. పుట్లగూడేనికి చెందిన చిట్టిశెట్టి విక్రమనాయుడు, నాగచైతన్య మరో ముగ్గురు చిన్నారులు ఊరు బయటకు వెళ్లి సైకిల్ నేర్చుకుంటున్నారు. ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వీరి వద్దకు వచ్చి కత్తులతో బెదిరించి సైకిల్ లాక్కుని అచ్చంపేట వైపు పరారయ్యారు. పిల్లలు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అచ్చంపేటలోని బంధువులకు ఫోను చేసి చెప్పారు. అచ్చంపేట ఊరిబయట వారు కాపు కాశారు. బైకుపై వస్తున్న ఇద్దరినీ పట్టుకునేందుకు వెంటపడగా..దొంగలు బైక్, సైకిల్ అక్కడే వదలి వెళ్లిపోయారు. బైక్‌లోని ఫోన్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా అచ్చంపేట పోలీసులు నిందితులను ఎన్టీఆర్ జిల్లా, పెనుగంచిప్రోలు మండలం, సుబ్బాయగూడానికి చెందినవారుగా గుర్తించారు. సాయంత్రం ఆ ఇద్దరు వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం.



పోలీసుకు లొంగిపోయిన నిందితులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమరావతి: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అంతరాయం ఉంటుందన్నారు.

సత్తెనపల్లి: పట్టణంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ ఏఈ పీబీ కిరణ్ తెలిపారు.

రాజుపాలెం: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ కోటా పెదమస్తాన్ తెలిపారు. రాజుపాలెం, కొండమోడు, అనుపాలెం, పెదనెమలిపురి, గణపవరం సబ్ స్టేషన్‌ల పరిధిలో సరఫరా ఆగిపోతుందన్నారు.

బెల్లంకొండ: బెల్లంకొండ, పాపాయపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు ఏఈ పవన్ కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాల వాగ్దానం నిలబెట్టుకోవాలి

అమరావతి: అర్హత కలిగిన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భైరాపట్నం రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా సీపీఐ ఆధ్వర్యంలో నిరుపేద కూలీలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఇంటి నిర్మాణ కోసం రూ.4 లక్షలు ఇస్తామని నమ్మబలికి చంద్రబాబు నాయుడు నేడు పట్టించుకోకపోవడం దారణమన్నారు. పెద్దకూరపాడు పార్టీ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ నివాస యోగ్యమైన స్థలంతో పాటు గృహ నిర్మాణం చేపట్టాని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకి వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా నాయకుడు శరణం విజయ, అమరావతి మండల కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దారు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గోకులం షెడ్లు ప్రారంభం

క్రోసూరు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం ద్వారా పశుపోషకులు నిర్మించుకున్న షెడ్లను శుక్రవారం ప్రారంభించారు. మొత్తం ఎనిమిది గ్రామాల్లో ప్రారంభించగా మండలంలోని ఎర్రబాలెం గ్రామంలో యేపూరి రామాంజనేయులు నిర్మించుకున్న షెడ్డును ఎంపీడీవో జి.శ్రీనివాస్, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీల గఫూర్ టీడీపీ నాయకులు ప్రారంభించారు. షెట్టు యూనిట్ ధర రూ.2.30 లక్షలు, గొర్రెల షెడ్డు రూ.1.30 లక్షలు అని ఎంపీడీఓ తెలిపారు. 15 షెడ్లు మంజూరుకాగా ఏడు పశువుల షెట్లు, ఒక గొర్రెల షెడ్డును పారంభించినట్లు తెలిపారు. ఏపీవో వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ పాల్గొన్నారు.

గోకులం షెడ్డు ప్రారంభం

సత్తెనపల్లి: మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లోని 16 గ్రామాలకు చిన్న, సన్నకారు రైతులకు 27 గోకులాల షెడ్లు మంజూరయ్యాయి. 11 షెడ్ల నిర్మాణం పూర్తి కావడంతో శుక్రవారం వాటిని ప్రారంభించారు. నందిగామలో గోకులం షెడ్డును సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆళ్ల సాంబయ్య అన్నారు ప్రారంభించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ల అమరేశ్వరరావు, సర్పంచ్ రమాదేవి, ఏపీడీ పీవీ నారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ రషీద్, ఫీల్డ్ అసిస్టెంట్ మార్కండేయులు ఉన్నారు.

బెల్లంకొండలో..

బెల్లంకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన గోకులం పశువుల షెడ్లను శుక్రవారం ఎంపీడీవో వై హనుమారెడ్డి అధికారులతో కలసి ప్రారంభించారు. చంద్రాజుపాలెం గ్రామంలో 3, మాచాయపాలెంలో 1, బెల్లంకొండలో 1, నాగిరెడ్డిపాలెంలో 1, వెంకటాయపాలెంలో 1 కలిపి మొత్తం 8షెడ్లను నిర్మించారు. ఏపీఓ కోటమ్మ, బెల్లంకొండ సర్పంచ్ గడిపర్తి జ్యోతి సముద్రం, గుంజా గంగారావు పాల్గొన్నారు.



నందిగామలో గోకులంను ప్రారంభిస్తున్న ఆళ్ల సాంబయ్య

గోకులం రైతుకు వరం

పెదకూరపాడు: పాడి పరిశ్రమకు మరింత చేయూతనిచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ కార్యదర్శి, పెదకూరపాడు అధ్యక్షుడు అర్తిమల్ల రమేష్ అన్నారు. పల్లె పండుగలో భాగంగా మండలంలో నిర్మించిన 15 గోకులం షెడ్లను ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. పశుపోషకులకు 90 శాతం రాయితీపై గోకులం షెడ్లు నిర్మించడం జరిగిందన్నారు. త్వరలో గ్రామ పంచాయతీకి రెండు చొప్పున 40 యూనిట్లు మంజూరు కానున్నట్లు వెల్లడించారు. పశుపోషకులు ఏటుకూరి లక్ష్మయ్య, పరుచూరి వెంకటకృష్ణ, గల్లా సురేష్ నిర్మించిన గోకులం షెడ్లను డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మాజీ ఎంపీపీ గల్లా బాబురావు, పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెన్నుపాటి బుల్లిబాబు, నాదెండ్ల కల్పన, ఎంపీడీవో రామకృష్ణ ఏపీవో కోటేశ్వరరావు, ఫీల్డ్ స్టాఫ్ అప్పారావు, సీసీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి

బెల్లంకొండ: గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి తెలిపారు. శుక్రవారం నాగిరెడ్డిపాలెం గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో హెల్త్ అండ్ న్యూట్రీషియన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను పరిశీలించారు. గ్రామాలలోని మహిళా సంఘాల ద్వారా వీటిని సేకరించి, స్వయం సహాయక సంఘాల్లోని గర్భిణీలు, కిశోర బాలికలకు అందజేశారు. ఎంటీఎల్ పవన్ కుమార్, ప్రవీణ, జయలక్ష్మి, అనంతలక్ష్మి, అంజలి, వీరమ్మ పాల్గొన్నారు.



ఉత్పత్తులను మహిళలకు అందజేస్తున్న డీపీఎం

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

అమరావతి: స్థానిక వెలుగు ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. డ్వాక్రా మహిళలు, యానిమేటర్లు, గ్రూపు లీడర్లు పొంగళ్లు పొంగించి, బొమ్మల కొలువు, పిల్లలకు బోగిపళ్లు పోశారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలను బహుమతులు ప్రదానం చేశారు. బ్యాంకు మేనేజర్లు, ఏపీఎం కృష్ణప్రియ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

సత్తెనపల్లి: పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. హరిదాసు వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు పిల్లలు తలపై భోగిపళ్లు, పూలు వేసి ఆశీర్వదించారు. ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శశిరేఖ, ప్రిన్సిపల్ లావణ్య లహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బొమ్మల కొలువుతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

సమన్వయంతో పనిచేయాలి

ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: గ్రామాలను అభివృద్ధి పథంలో నడపించడమే ధ్యేయంగా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు శాఖల పనితీరును వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిత్యం సిబ్బందితో చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా తాగునీటి ట్యాంక్‌ల్లో బ్లీచింగ్ చేయించాలని చెప్పారు. బోర్లకు మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా వంద పని దినాలు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, ఎంపీడీవో వై.హనుమారెడ్డి, వైస్ ఎంపీపీలు బూదాటి మరియమ్మ, షహనాజ్ బేగం, ఎంపీటీసీలు మర్రి శ్రీనివాసరెడ్డి, మాదాసు రాంబాబు, చిట్టిశెట్టి శివనాగమణి, రేగులగడ్డ తిరుపతమ్మ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు బద్దూరి శ్రీలక్ష్మీ, దారం వెంకటనరసమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావెంకటేశ్వరరెడ్డి